# సమ్మె! నువ్వెంతవైనా తగుదువు!

కె. సరోజ



"విద్యార్థి లోకం"
"వర్ధిల్లాలి"
"విద్యార్థి లోకం"
"వర్ధిల్లాలి"

"కళాశాలలో క్లాసులు జరగడానికి వీల్లేదు, పరీక్షలు జరగటానికి వీల్లేదు" విద్యార్థి నాయకుడు చెవులు చిల్లులు పడేలా అరుస్తున్నాడు.

మిత్ర బృందం అతడ్ననుసరిస్తూ—

"వర్ధిల్లాలి, విద్యార్థి లోకం" అంటూ గొంతులు చించుకుంటూ మెయిన్‌రోడ్డు మీదకు వచ్చారు.

"అందరూ సమ్మెలో పాల్గొనాలి, లేని పక్షంలో కళాశాల శాశ్వతంగా మూత పడుతుంది."

రోడ్డు మీద బారులు తీరి నడుస్తూ పొలికేకలు పెడుతున్నారు.

* * *

"ఏందుకు నాయనా సమ్మెలూ — పోరాటలు!" ఎవరో పెద్దమనిషి ప్రశ్నించాడు విద్యార్థి నాయకుడైన రామారావ్‌ని.

రామారావ్ తోక తొక్కిన త్రాచులా బుసలు కొడ్తూ, "మీకేం తెల్సండి మా ఆవేదన" అన్నాడు.

"ఏం ఆవేదన బాబూ ?"

"మా స్టూడెంట్సు కాపీ చేస్తుంటే ఇన్‌విజిలేటర్ గాడికేం నష్టం చెప్పండి! ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చేసి వాళ్ళను పరీక్షలు వ్రాయనివ్వకుండా చేస్తాడా, ఎంత ధైర్యం! అందుకే పరీక్షలూ జరగవు, క్లాసులూ జరగవు. మా వాళ్ళు కాపీ అయినా కొట్టాలి, సమ్మె అయినా జరగాలి."

"తప్పుకదు బాబూ!"

"తప్పేంటండీ తప్పు! విద్యార్థులను పరీక్ష వ్రాయనివ్వకపోవటం తప్పు కాదా! వెళ్ళండి, వెళ్ళండి మహా చెప్పొచ్చారు"

తన విసుగు, మాటల్లో పూర్తిగా తెలియచేశాడు.

"నా కెందుకులే నాయనా" అంటూ ముసలాయన వెళ్ళిపోయాడు.

'ఇలాంటి ముసలాళ్ళతో చావొచ్చి పడింది' గొణుక్కున్నాడు రామారావ్.

విద్యార్థుల గుంపు నాపరమూకలా ముందుకు కదిలింది.

"ప్రిన్సిపాల్ బయటకు రావాలి
సమ్మెను సమర్థించాలి
ప్రిన్సిపాల్ బయటకు రావాలి"

స్టూడెంట్స్ అరుపులకు కొండరాళ్ళు కూడా బద్దలయేలా వున్నాయి.

ప్రిన్సిపాల్ సౌజన్యరావ్‌గారు నెమ్మదిగా బయటకు వచ్చి, అంతకంటే నెమ్మదిగా మేడదిగి క్రిందికి వచ్చి ...

"బాబూ మీకు పుణ్యముంటుంది. బుద్ధిగా చదువుకుని పరీక్షలు వ్రాయండి. ఏందుకు రూల్సుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు!"

నచ్చచెప్పబోయారు.

"అయితే మీరు సమర్థించరన్న మాట?"

"అన్యాయాన్ని, అరాచకాన్ని సమర్థించడమేమిటి!"

"అంతే నంటారా ?"

"ఆఁ...అంతే"

"అయితే ఈ రోజు మీరసలు అడుగు బయటకు వేయలేరు జాగ్రత్త"

బెదిరించాయి బోలెడు కంఠాలు.

అలా అంటూనే టెలిఫోను కనెక్షన్

పీకి పారేసి ఆయన్ని ఒక్కతోపు తోశారు.

అదృష్టమో, దురదృష్టమో కానీ కొంత దూరంలో వున్న కుర్చీలో పడ్డారు. మొత్తానికి చిన్న దెబ్బ తగిలింది చేతిమీద. చేసేదిలేక కుర్చీలో నుండి లేచి పైకి వెళ్ళిపోయారు.

* * *

సమయం మధ్యాహ్నం పన్నెండైంది. ప్రిన్సిపాల్ సౌజన్యరావ్‌గారికి ఇంటి నుండి భోజనం వచ్చింది. కారియర్ మనిషిని పైకి వెళ్ళనివ్వకుండా అటకాయిస్తున్నారు సమ్మెదారులు.

సౌజన్యరావుగారికి విపరీతమైన నీరసం వచ్చేసింది. ప్రొద్దున త్రాగిన ఆ చిన్న గ్లాసెడు కాఫీ తప్ప మరొకటి లేదు. 'లంచ్' లేకుండా తనొక్కరోజు కూడా వుండలేదు. ప్రొద్దున టిఫిను లేకపోయినా ... రాత్రి భోజనం లేకపోయినా ఫర్వాలేదు కానీ ...

పైనుండి ఒకసారి క్రిందకి చూశారు. ఆయనకి కళ్ళు తిరిగి నట్లనిపించడమేకాక అక్కడి దృశ్యం బాధాకరంగా కూడా వుంది.

తన కారియర్ లోని అన్నం — కూరలు విద్యార్థులు చెలా చెదరుగా విసిరేస్తున్నారు. ఆయనకు కడుపులో దేవినట్లనిపించింది.

మళ్ళీ తన రూమ్‌లోకి వెళ్ళారు.

ఆయన ఇలా తన రూమ్‌లోకి, బయటికి తిరుగుతూనే వున్నారు. సమయం గడిచేకొద్దీ చాలా అనీజీగా ఫీలవుతున్నారు.

మిగిలిన స్టాఫంతా చిన్నవాళ్ళు కాబట్టి ఫరవాలేదు. తను యాభై ఏళ్ళ పైచిలుకు వాడు.

సౌజన్యరావుగారి కంతా అగమ్యగోచరంగా వుంది.

ఈ సమ్మె గొడవతో కాలేజ్ కాంటీన్ కూడా మూత పడింది. ఆశ్చర్యమేమంటే విద్యార్థినులు కూడా సమ్మెను సమర్థిస్తున్నారు. లెక్చరర్సంతా స్టూడెంట దుండగాలకు దడిసి నోరు మెదపటం లేదు.

టైము ఒంటి గంటైంది. రెండూ, మూడు...

సౌజన్యరావ్‌గారు తను కనీసం ఇంటి కెళ్ళగలిగితే బాగుండుననుకొని మెట్లు దిగటం ప్రారంభించారు.

ఉదయం నుండి ఆహారం లేకపోవటం వల్ల రెండు మెట్లు దిగీ, దిగకముందే కళ్ళు బైర్లు కమ్మాయి. శరీరం గాలిలో తేలుతున్నట్లుగా వుంది. ఏమిటో గా అయిపోతోంది.

అంతే, మూడో మెట్టు మీద అడుగు పెట్టబోతున్న వారల్లా ఫుట్‌బాల్ లా దొర్లిపోయారు.

ఈ హఠాత్పరిణామానికి ఇంచుమించుగా స్టాఫంతా కలవరపడి, వెంటనే హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళారు.

స్టూడెంట్సులో కొద్దిగా కలకలం చెలరేగింది కానీ, సమ్మె ఆగిపోలేదు.

* * *

సౌజన్యరావ్‌గార్ని సునీతా నర్సింగ్ హోమ్‌లో వున్న ఎమర్జెన్సీ వార్డులో వుంచారు.

అది 'హార్ట్ ఎటాక్' అని తేల్చారు డాక్టర్స్.

అంతకుముందు అంటే ఆయన యాభై అయిదేళ్ళ జీవితంలో కనీసం తలనొప్పి రావటం కూడా ఎరుగరు. ఎంతో ఆరోగ్యమైన మనిషి. ఎంత దూరమైనా నడిచే వారు. ప్రతిభ, చురుకుదనాల్లో ఆయన కాయనే సాటి.

డాక్టర్ వేణు

మౌత్ టూ మౌత్ రెస్పిరేషని

ఎక్స్‌టర్నల్ కార్డియక్ మాసాజ్

మార్ఫియా పదిహేను మిల్లిగ్రాముల ఇంజక్షనిచ్చారు.

కాంపోజ్

ఆక్సిజన్ పెట్టారు

ఆబ్ సల్యూట్ బెడ్ రెస్ట్ ఇచ్చారు.

ఒకరేమిటి చేయగలిగినదంతా చేశారు.

ఆయన మంచం చుట్టూ ఆయన భార్యా —పిల్లలు, కొందరు లెక్చరర్సు, కొందరు విద్యార్థులు ఆత్రుతగా ఆయన వైపు చూస్తున్నారు.

క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయి, ఎవరి ముఖం చూసినా విషాదం విలయతాండవం చేస్తోంది.

సౌజన్యరావ్‌గారి భార్య శారదమ్మ పమిట చెరుగు నోట్లో కుక్కుకుని దుఃఖిస్తోంది. పెద్ద కూతురూ — కొడుకూ ఆమెను ఓదారుస్తున్నారు.

సౌజన్యరావ్‌గారు కొద్దిగా పక్కకు ఒత్తిగిల్లారు.

"అమ్మయ్య, స్పృహ వస్తోంది" అనుకున్నారంతా

"మరేం ఫర్వాలేదు" అన్నారు డాక్టర్ వేణు.


శారదమ్మ ముఖంలో చిన్న వెలుగురేఖ తళుక్కుమంది.

సౌజన్యరావ్‌గారికి స్పృహ వచ్చేసింది.

అందరివైపు పరికించి చూశారు.

"ఒరేయ్ ప్యూన్ వెంకటేశం తాళాలెక్కడ పెట్టావురా? ఒరే ఇంగ్లీషు లెక్చరర్ అవధానీ నీకు బుద్ధి వంకరరా! ఒరే పరమేశం నీ కెంత సహాయం చేశానురా.

ఆంజనేయులున్నాడే వాడికి నేనేం అపకారం చేశానురా? ఆ ముకుందరావ్‌గాడికి ఉద్యోగం వూడిపోతుంటే ఎన్ని సార్లు నిలబెట్టానురా!



నా సర్వీసంతా ఈ కళాశాలకే అంకితం చేశాను. పంతొమ్మిది వందల యాభై లో సరస్వతీ పూజ చేసి మొదటగా నా విద్యార్థి విద్యార్థినులకు పాఠం చెప్పాను, నా సర్వీసింకా మూడేళ్ళకంటే లేదు.

నా స్టూడెంట్సంటే నా పిల్లల కంటే ఎక్కువ. లెక్చరర్సందరూ నా వాళ్ళే అనుకున్నాను. ఎంత పిచ్చివాణ్ణి? చివరకు నా మీదే కక్ష గట్టారు కదురా!"

"ఆ విషయాలు మరచిపోండి నాన్నా" అన్నాడు కొడుకు.

"మర్చిపోవటమా!..." దోసిట్లో ముఖం దాచుకుని ఏడ్చారు.

"ఏమండీ ఏలా వుంది" శారదమ్మ ప్రశ్నించింది.

"బాగానేవుంది కానీ, నువ్విలా వచ్చి కూర్చో"

""జానీ నాన్నగారికి కొంచెం హార్లిక్సు తీసుకురామ్మా" శారదమ్మ రెండో కూతురికి చెప్పింది.

జానీ వెలుపలకు వెళ్ళింది.

ఆయన భార్య చేతిని తన చేతిలోకి తీసుకుంటూ,

"ఒక్కపూటకే ఏలాగో అయిపోయావు, నాకేం ఫర్వాలేదు కానీ, నువ్వింటికెళ్ళి విశ్రాంతి తీసుకో" అన్నారు.

వారి మధ్య మౌనంగా గడిచాయో పది నిముషాలు.

"శారదా ఏమిటోగా వుంది, డాక్టర్ని పిలవండి" అన్నారున్నట్టుండి.

"పిచ్చార్"

పిచ్చార్, ఎవరో పిల్చారు. పిచ్చార్ డాక్టర్ని పిలవడానికి వెళ్ళింది. ఇంతలోపలే సౌజన్యరావ్‌గారు వాంతి చేసుకుని గిల గిల తన్నుకుని మంచం మీద నుండి పడిపోయారు.

డాక్టర్ వేణు అప్రతిభుడై వెంటనే నర్సు సాయంతో ఆయన్ని తిరిగి మంచం మీద పడుకోబెట్టాడు.

డాక్టర్ చక చక తన విధినిర్వహణ కుపక్రమించాడు. నాడి అందలేదు. ఏదో చెప్ప బోయి శక్తి చాలక ఆగిపోయిన ఆ సగం తెరచిన నోరూ — కళ్ళూ అలాగే వుండి పోయాయి.

"ఐయామ్ సో సారీ, నా గురువుని బ్రతికించుకోలేక పోయాను" అని పైకే అనుకుంటూ వెళ్ళిపోయాడు డాక్టర్ వేణు

## సమ్మె! నువ్వెంతకైనా...

ఒకప్పటి సౌజన్యరావ్‌గారి శిష్యుడు.

"అమ్మా మిమ్మల్ని విడిచి వుండలేనమ్మా అనే వారెప్పుడూ. యిప్పుడు మమ్మల్ని దౌర్భాగ్యులను చేసి వెళ్ళిపోయారా! ఆ దేవుడిక్కూడా మీరంటే ఇష్టం కాబోలు" అని గొల్లుమన్నారు పిల్లలందరూ.

శారదమ్మగారి దుఃఖానికి ఆనకట్టలే లేవు.

హార్లిక్స్ గ్లాసుతో లోపలికి ప్రవేశించిన జానీ చేతిలో నుండి గ్లాసు జారిపడింది.

శారదమ్మగారికి ఎవరి సానుభూతి వచనాలు ఓదార్పు నివ్వటంలేదు.

### అంతరం

నీకూ...నాకూ...
ఎప్పుడూ
రెండూ...రెండూ...
నాలుగే!
ఎటొచ్చీ
నేను మితవాదిని
కూడు తాను
నువ్వు అతివాదివి
హెచ్చు వేస్తావు!

— వీయస్సెన్నీ కవిత

ఇది మామూలు చావు కాదు. 'హత్య, హత్య' అని ఘోషించిందామె హృదయం.

ఆ ఊర్లో ఎవరి నోట విన్నా అదే వార్త.

'పాపం సౌజన్యరావ్‌గారు పిల్లలు గలవారు, ఇది హత్యే అసలు. ఏ నాడూ అనారోగ్యం అనేది ఎరగని మనిషి, అతి మంచి వ్యక్తి' ఇత్యాదులు.

ఊరికి పడమర దిక్కున ఆయన అంతిమ యాత్రకు సన్నాహం.

తూర్పు దిక్కున 'సమ్మె ముగింపు'

విద్యార్థీ, విద్యార్థినులు, వారి నాయకుడు ప్రిన్సిపాల్ గారికి శాశ్వతంగా వీడ్కోలివ్వడానికి వచ్చారు.

"సమ్మె ముగిసింది సార్! మిమ్మల్ని బలికొన్నది సార్!" అంటూ కన్నీరు నింపుకున్నారు.

"ఇంత దారుణం జరుగుతుందనుకోలేదు, అసలీ పరిస్థితికి కారకులెవరో తెలుసా సార్! వాళ్ళకు జీతాలు రాలేదని, మమ్మల్ని సాధనాలుగా వాడుకున్న కొందరు లెక్చరర్లు సార్. అయినా కమిటీ కాలేజీలో ప్రిన్సిపాల్ కేం పవర్సుండవని వాళ్ళకు తెలియకనా సార్! మీరూ వాళ్ళలాగా జీతంతో బ్రతికేవారే కదా సార్!

లెక్చరర్ల మాట విని మిమ్మల్ని తిండి తినకుండా చేసింది మేమేసార్. మీరు ప్రిన్సిపాలైనప్పటి నుంచి మీ మీద ఈర్ష్యగా వున్నవాళ్ళే యిలా చేశారు సార్. ఆక్సిజన్ ట్యూబ్ తీసెయ్యండని మీరు అంటూ లేవబోతుంటే మీ స్థితికి నవ్వుకున్నారు సార్ వాళ్ళు! వాళ్ళంతా మేకవన్నె పులులు సార్, మాకు తెలియక పొరపాట్లు వాళ్ళను నమ్మాం సార్! మిమ్మల్ని మెట్ల మీద నుండి నెట్టింది మేమే సార్. మీ లాంటి అతి మంచి వ్యక్తిని పొట్టన బెట్టుకున్నాం సార్. మమ్మల్ని క్షమించ మనడానిక్కూడా అర్హత లేదు సార్!" అంటూ భోరున ఏడుస్తూ, ఆయన భౌతిక కాయంపై పూలు చల్లాడు విద్యార్థి నాయకుడు రామారావ్.

పశ్చాత్తాపాగ్ని అతన్ని నిలువునా దహించి వేస్తోంది. ఎవరు ఏమనుకున్నా, పశ్చాత్తాప పడినా—మానినా సౌజన్యరావ్‌గారు ఇంక తిరిగి రాలేని చోటుకి వెళ్ళిపోయారు.

అసలు మనదేశంలో సమ్మెల పేరుతో జరుగుతున్న ఇలాంటి అక్రమాలకు, అవినీతికి బాధ్యులెవరు? అని ప్రశ్నిస్తే—

ఆ ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోతుంది.

పడివయసులోని భార్య, ఎక్కువ సంతానం, చదివించవలసిన పిల్లలు, పెళ్ళి చేయవలసిన పిల్లలు...

వీరి బాధ్యతలను ఎవరు స్వీకరిస్తారు?

పెళ్ళై తన సంసార బాధ్యతల్లో మునిగి పోయిన అమ్మాయా? చదువుకునే అబ్బాయా? లోకం పోకడ తెలియని చిన్నారులా? విద్యార్థులా? విద్యార్థి నాయకుడా? అదృశ్య హస్తాలాడి విద్యార్థులను పురికొల్పిన వారా?

ఎవరు?

వారి సమస్యలకి పరిష్కారం కాలమే చెప్పాలి!

### అంకితం

గురువుగారు శ్రీ ఎస్. వి. యస్. శర్మగారికి చిరు సుమమాల —

— రచయిత్రి